క్లుప్తంగా

ఘనంగా గ్రంథపాలకుల దినోత్సవం



రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ చింతలయ్య తదితరులు

సి.బెళగల్: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం (నేషనల్ లైబ్రేరియన్స్ డే) ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ చింతలయ్య ఆధ్వర్యంలో మంగళవారం లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు గ్రంథపాలకుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి అధ్యాపకులు, సిబ్బందితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ నిర్వహణలో ఎస్ఆర్ రంగనాథన్ సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయ నిర్వహణ, ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



అథ్లెట్ ఎస్.హాజీబాషాకు ప్రశంసా పత్రం అందిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం గోరంట్ల గురుకుల పాఠశాల విద్యార్థి ఎస్.హాజీబాషా జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై నట్లు పీఈటీ రాజు మంగళవారం తెలిపారు. ఈనెల 9, 10 తేదీల్లో గుంటూరు జిల్లా చీరాలలో జరిగిన 2025 ఏపీ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–14 విభాగంలో గోరంట్ల గురుకుల పాఠశాలకు చెందిన ఎస్.హాజీబాషా ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి హాజీబాషాను ప్రిన్సిపాల్ భూషన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ

కర్నూలు (రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు శ్రావణ మాసం సందర్భంగా మహిళలు అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నాగులకట్ట వద్ద మహిళలు, యువతులు, కొత్తగా పెళ్లయిన జంటలు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాగణం కిటకిటలాడింది.





కుందూ నది వంతెన వద్ద గుర్రపు డెక్కను తొలగిస్తున్న సిబ్బంది, అనుపూరు వద్ద కొర్రవాగు ఉధృతికి వాహనాలను నిలిపివేసిన దృశ్యం



అహల్యాపురం వద్ద ఒరిగిన విద్యుత్ స్తంభం

ఉప్పొంగిన వాగులు

- అనుపూరును చుట్టుముట్టిన వరద
- తెల్లవారుజామున నుంచి తగ్గుముఖం
- మద్దూరు కుందూనదిపై నిలిచిన రాకపోకలు
- ఉపాధ్యాయుడికి తప్పిన ప్రమాదం

పాణ్యం: మండలంలో భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలుచోట్ల వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దాటేందుకు వీలు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాల కారణంగా కుందూనదికి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. అనుపూరు గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తూరు రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఉంది. ఈ రోడ్డుపై తెల్లవారుజామున 4 అడుగుల మేర కుందూనది నీరు ప్రవహించింది. నీటి ప్రవాహం కారణంగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తెల్లవారిన తర్వాత నీటి ప్రవాహం కాస్త తగ్గుముఖం పట్టడంతో ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల సహాయంతో రాకపోకలు సాగాయి. నీటి ప్రవాహం కారణంగా బయటికెళ్లిన వారు కొత్తూరు రోడ్డు వద్దనే వాహనాలను పెట్టి గ్రామంలోకి నడుచుకుంటూ వెళ్తున్నారు.

- అనుపూరు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జయప్రకాష్‌నారాయణ్ ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా నీటి ప్రవాహం వల్ల ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై పట్టు కోల్పోయారు. గ్రామస్తులు ఆయన్ను కాపాడారు.
- మద్దూరు సమీపంలో కుందూనది బ్రిడ్జి వద్ద భారీగా గుర్రపుడెక్క చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పంచాయతీ సిబ్బంది ఆకును తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.
- తొగర్చేడు వద్ద కుందూనది బ్రిడ్జిపై నీరు ప్రవహించింది. తెల్లవారుజామున వరకు ప్రవాహం కొనసాగింది.
- అనుపూరు – అహల్యాపురం గ్రామానికి రోడ్డుపక్కన వేసిన విద్యుత్ స్తంభం నెలకొరిగింది.
- గగ్గటూరు–రాయపాడు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గగ్గటూరు ముందు ఉన్న ఊరిముందరి వాగు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలు స్తభించాయి.



ట్రాక్టర్‌లో వాగు దాటుతున్న గ్రామస్తులు

రోడ్డుపైనే వర్షపు నీరు

కల్లూరు: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల శరీన్‌నగర్‌లోని రోడ్లపైనే వర్షపు నీరు నిలుస్తోందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకులు అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 29వ వార్డు శరీన్‌నగర్‌లో సీపీఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు యేసు మాట్లాడుతూ.. ఎంఈఓ కార్యాలయం (ఎంపీపీ పాఠశాల) పక్కన ఉన్న కాలనీలో నిత్యం మురుగు నీరు, వర్షపు నీరు నిలుస్తోందన్నారు. ఈ రోడ్డుపై నిత్యం పాఠశాల విద్యార్థులు తిరుగుతుంటారని, మురుగు నీరు దోమలు, ఈగలకు నెలవుగా మారుతోందన్నారు. డ్రైనేజీ కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కేవీపీఎస్ నాయకులు మధు, మాదన్న, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నిలిచిన నీటిని చూపిస్తున్న సీపీఎం నాయకులు

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: కంది పంటను సాగు చేసిన రైతులు సస్యరక్షణ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ సూచించారు. ఆయన మంగళవారం సి.బెళగల్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రైతులు సాగు చేసిన కంది, పత్తి పంటలను పరిశీలించి వారితో మాట్లాడారు. కంది పంటలో మరూకమచ్చల పురుగు, గూడు పురుగు నివారణకు లీటరు నీటికి 0.2 మిల్లీలీటర్ల క్లోరోపైరీఫాస్, లేదా మోనోక్రోటోఫాస్‌ను పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక రైతు సేవ కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి పంటల సాగులో మెలకువలను వివరించారు. పంటల బీమా నమోదుకు ఈ నెలాఖరు వరకు అవకాశం ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈఓ హిమబిందు, వీఏఏ ఆసీఫ్, ఎంపీఈఓ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.



పడిదెంపాడులో వరి నాట్లు వేస్తున్న మహిళలు

వరి నాట్లకు శ్రీకారం

కర్నూలు(రూరల్): మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వరి నాట్లకు శ్రీకారం చుట్టారు. కేసీ కెనాల్ ఆయకట్టు, తుంగభద్ర నది పరివాహక ప్రాంతంలో, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో వరి పంటను సాగు చేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలోని పడిదెంపాడు, నిడ్జూరు, జి.సింగవరం, మమిదాలపాడు, పూడూరులో కేసీ కెనాల్ నీటి పారుదల ఉండటంతో రైతులు వందల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఒక ఎకరం వరినాట్లు వేయడానికి 10 మంది కూలీలు అవసరం అవుతారని రైతులు తెలిపారు. ఒక కూలీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నాట్లు వేస్తే రూ.500 ఇస్తున్నట్లు చెప్పారు.



వరినాట్లు వేసేందుకు పొలంలో మడక వేస్తున్న రైతు

హాస్టల్‌కు ఫ్యాన్లు, కుర్చీల వితరణ

కర్నూలు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహానికి మంగళవారం గురు అశోక్ సేవా ఫౌండేషన్ వివిధ రకాల వస్తువులను విరాళంగా అందించిందని వసతి గృహ సంక్షేమాధికారిణి శైలజ తెలిపారు. వసతి గృహంలోని బాలికల ఇబ్బందులను ఫౌండేషన్ దృష్టికి తీసుకుపోగా హాస్టల్‌కు అవసరమైన గ్రైండర్, బీరువా, ఆరు ప్లాస్టిక్ కుర్చీలు, ఏడు ఫ్యాన్లు, 10 ట్యూబ్ లైట్లను అందించారని చెప్పారు. ఫౌండేషన్ ప్రతినిధులు డీ.సునందనదాస్, కే.హైమావతికి హెచ్‌డబ్ల్యూఓ శైలజ కృతజ్ఞతలు తెలిపారు.

వేతన బకాయిలు మంజూరు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న స్వచ్ఛ భారత్ కార్మికులు

సి.బెళగల్: తమకు ఎనిమిది నెలలుగా గౌరవ వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే మంజూరు చేయాలని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులు (పారిశుద్ధ్య కూలీలు) ధర్నా చేశారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులు సమావేశమై సీఐటీయూ డివిజన్ నాయకుడు మోహన్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేపడుతున్న తమకు 8 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, దీనితో కుటుంబాల పోషణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించడంతో పాటు, తమకు కాస్మోటిక్ వస్తువులను సైతం అందించాలని, అదేవిధంగా గౌరవ వేతనం నెలకు రూ.10 వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసులుకు అర్జీ ఇచ్చారు. స్వచ్ఛ భారత్ కార్మికులు లక్ష్మన్న, వెంకటన్న, ప్రసంగి, సుంకన్న, సంజన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

పాణ్యం: మండల పరిధిలోని భూపనపాడు గ్రామ బీసీ కాలనీలో గత కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై ఇటీవల కాలనీవాసులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకోగా స్పందించిన కలెక్టర్ రాజకుమారి గనీయా మంగళవారం గ్రామలోని బీసీ కాలనీని సందర్శించారు. గ్రామస్తులు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో కలిసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు.

గ్రామంలోని బీసీ కాలనీలో దాదాపు 70 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ కాలనీ నుంచి డ్రైనేజీ నీరు వెళ్లేందుకు మార్గం లేక రోడ్లపై నిల్వ ఉండి కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వాటి నుంచే వచ్చే దుర్గంధంతో రాకపోకలు సాగిచేందుకు వీలులేకుండా కాలనీ మురికి కూపంలో ఉండిపోయింది. చేసేది లేక కాలనీ వాసులు సమస్యపై మరోమారు కలెక్టర్‌ను కలవడంతో ఆయా శాఖల అధికారులతో గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. కాలనీకి అటు ఇటు బీటీ రోడ్ల వెంట కాల్వలు తవ్వాలని కలెక్టర్ సూచించారు. అక్కడి నుంచి సుంకులా పరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న ప్రధాన డ్రైనేజీ కాల్వలో నీరు కలిసేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం కాలనీలో మురుగు నీటి నిల్వ ఏర్పడకుండా కాల్వల తవ్వకం పనులు ప్రారంభించాలని సూచించారు. దీంతో ఆయా శాఖల అధికారులు రోడ్డుకు అటు, ఇటు డ్రైనేజీ కాల్వలను తీశారు. త్వరలోనే సీసీ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీ ప్రజలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ జనార్దన్, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధరర్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఉన్నారు.



తహసీల్దార్‌తో మాట్లాడి సమస్యను తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గనీయా

గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి

ఓర్వకల్లు: గృహ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ చిరంజీవి అన్నారు. మంగళవారం మండలంలోని నన్నూరులో గల హౌసింగ్ లేఅవుట్‌ను సందర్శించి, గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి, ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని అవగాహన కల్పించారు. పీడీ చిరంజీవి మాట్లాడుతూ.. ఇళ్లను త్వరగా నిర్మించుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు, రూ.75 వేలు వస్తాయని తెలిపారు. గతంలో అడ్వాన్సు కింద రూ.15 వేలు, రూ.20 వేలు, రూ.30 వేల చొప్పున తీసుకున్న లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని, లేదంటే ఆ సొమ్మును హౌసింగ్ కార్పొరేషన్‌కు డీడీ రూపంలో తిరిగి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హౌసింగ్ ఈఈ ఏఎల్ ప్రభాకర్, ఏఈ శ్రీనాథ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రామునాయక్, సత్తన్న, సుగుణమ్మ, మల్లయ్య, ఆపరేటర్లు రమేష్, పరందామయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మునిస్వామి, రాంజీ, అర్చన తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

గడివేముల: పాఠశాల, కాలేజీల్లో చదివే విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. ఆయన మంగళవారం గడివేములలోని ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా స్కూల్‌లో ర్యాగింగ్, బాల్య వివాహాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థినులతో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. పిల్లలకు మోటార్ బైక్‌లు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులు చెడు మార్గంలో వెళ్లకుండా మంచి మార్గంలో నడిచి బాగా చదువుకుని పేరుతెచ్చుకోవాలన్నారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని విద్యార్థులకు సూచించారు. సిగరెట్లు కాల్చడం, మందు తాగడం, అమ్మాయిలను కామెంట్ చేయడం ఫ్యాషన్‌గా ఫీలవుతున్నారని అదే వారి నాశనానికి తొలిమెట్టన్నారు. స్కూల్, పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్, మాదక ద్రవ్యాల గురించిన సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1972కు గానీ, వాట్సాప్ నంబర్ 89777 81972కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ శైలజ, ఎస్ఓ రుబీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ కథల పోటీల్లో ప్రతిభ



విద్యార్థిని ఆదిత్యను అభినందిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి ఆదిత్య జాతీయ కథల పోటీల్లో ప్రతిభ కనబరచి బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం రమ తెలిపారు. ఆమె మంగళవారం వివరాలను వెల్లడించారు. మాచిరాజు బాల సాహిత్యపీఠం హైదరాబాద్ వారు ఈ నెల 10న రవీంద్రభారతిలో నిర్వహించిన కథల పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని ఆదిత్య పాల్గొని ప్రతిభ చాటినట్లు చెప్పారు. ఆదిత్య రాసిన 'లడ్డూ కావాలా నాయనా' కథకు ప్రోత్సాహక బహుమతి లభించిందని, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీతలు పత్తిపాటి మోహన్, చొక్కారపు వెంకటరమణ, దాసరి వెంకటరమణ నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతోపాటు చందమామ కథల పుస్తకాలను అందజేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ మేరకు మంగళవారం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఆ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



కోడుమూరులో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న తహసీల్దార్ నాగరాజు

కోడుమూరు రూరల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కోడుమూరు బాలుర హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న పాల్గొని వైద్య సిబ్బందితో కలిసి విద్యార్థులకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణ కోసం పిల్లలంతా తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని వైద్యాధికారి సూచించారు. హెచ్‌ఎం రామచంద్రుడు, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాబాయి, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో..: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలలో విద్యార్థినీ, విద్యార్థులకు వైద్య సిబ్బంది మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వైద్యాధికారులు షఫీయా బేగం, ప్రత్యూష, ఎంపీహెచ్‌ఈఓ రామకృష్ణ, సీహెచ్‌ఓ శాంతకుమారి, హెచ్‌ఈఓ క్రిష్టారెడ్డి, హెచ్ఎస్‌లు రాఘువయ్య, బేబీరని, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాలలో 95 శాతం మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి రేఖ తెలిపారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. హుసేనాపురం పీహెచ్‌సీ పరిధిలోని 1–18 ఏళ్ల వయస్సు గల పిల్లలకు ఈ మాత్రలను వేసినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. 34 అంగన్‌వాడీ కేంద్రాలు, 43 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో కలిపి మొత్తం 10,200 మంది పిల్లలకు గాను 9,865 మందికి మాత్రలను పంపిణీ చేసినట్లు తెలిపారు. గుట్టపాడు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ఓంకార్‌యాదవ్ సందర్శించి మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను వేశారు. దీంతో మొదటి రోజున 95 శాతం మాత్రల పంపిణీ పూర్తి చేసినట్లు వెల్లడించారు. మిగతా వారికి ఈ నెల 20వ తేదీన వేస్తామని తెలిపారు.

పట్టు జారితే అంతే!



వాగు అవతలికి వెళ్లి ప్రమాదకర స్థితిలో చేపల వేట సాగిస్తున్న యువకులు

కర్నూలు(రూరల్): చేపల వేట రూపంలో ప్రమాదం పొంచి ఉంది. మంగళవారం ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని పడిదెంపాడు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన కేసీ కెనాల్ వంతెన కింద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కర్నూలు నగరానికి చెందిన కొందరు యువకులు వాగుకు అవతలి వైపు వెళ్లి దాదాపు 12 అడుగుల ఎత్తులో ఉన్న బెడ్‌పై కూర్చొని గాలాలు, చిన్నపాటి సంచి వేసి చేపలను పట్టే పనిలో నిమగ్నం అయ్యారు. పొరపాటున వాగులో జారి పడితే నీటి ప్రవాహ ఉధృతి, లోతు ఎక్కువగా ఉండటం వల్ల పెద్ద అపాయం ఏర్పడే అవకాశముంది. ప్రాణాలను ఫణంగా పెట్టి చేపల వేట సాగిస్తుండటంతో అటుగా వెళ్లిన వారు బాబూ జాగ్రత్త అని అప్రమత్తం చేస్తున్నారు.

వంద అడుగుల తిరంగా జెండాతో ర్యాలీ

కోడుమూరు రూరల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మంగళవారం కోడుమూరులో మండల అధికారులు విద్యార్థులతో కలిసి వంద అడుగుల తిరంగా జెండాతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కోడుమూరు తహసీల్దార్ నాగరాజు, ఎంఈఓ వసంతలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా, స్వాతంత్ర్య దినోత్సవం గొప్పతనాన్ని వివరిస్తూ, నినాదాలు చేస్తూ అధికారులు, విద్యార్థులు పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

మహాలక్ష్మి ITI
■ ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, ప్లంబర్ ట్రేడ్‌లకు అడ్మిషన్స్ జరుగుచున్నవి. సంప్ర: రాచంరెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ : 99893 76326, బస్టాండ్ ఎదురుగా, ATP. [A-7159]

WANTED
■ హైదరాబాద్ మియాపూర్‌లో ముస్లిం ఫ్యామిలీ కొరకు ముస్లిం ఆయా కావలెను. ఫ్రీ రూమ్+భోజనం. సంప్ర: Shaik: 93966 47848. [SCA25007220]
■ కొత్తగా ప్రారంభించిన మా బ్రాంచిలో పనిచేయుటకు 39 స్త్రీ/పుల కావలెను. జీ:15వేలు+DA6వేలు+బోనస్+ ఫ్రీ రూం, అ: 7th-డిగ్రీ, ITI, డిప్లొమా (P/F), శ్రీనివాస టాకీస్, కల్లూరు రోడ్, కర్నూలు. 8074816824 [SCA25007216]
■ ప్రముఖ MNC కంపెనీలోకి యువతీ, యువకులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. జీతం: 18K-30K, అర్హత: 10th,ఇంటర్,డిగ్రీ డిప్లొమా, ITI. సంప్ర: 8792811822, 7349209240. [SCA25007195]
■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ 20K. ఫోన్: 8977639662, 8977639663 [SCA25007136]
■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు, ఫ్రీ రూం+భోజనం. Hyd. 7995365999 [HA-16125]

■ కర్నూలులో ప్రముఖ HAPYCAR కార్ రెంటల్ సంస్థలో ఫ్లీట్(Fleet) ఎగ్జిక్యూటివ్ నియామకం. అర్హతలు: కనీసం ఇంటర్ / డిగ్రీ ఉత్తీర్ణత, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిఉండాలి, జీతం: 5K + Incentives, స్థానం: కర్నూలు: 6301174565, 8919042980. [SCA25007222]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com